క్లుప్తంగా

జన నీరాజనం



జననేతను చూసేందుకు వీఆర్‌సీ వద్ద బారులు తీరిన ప్రజలు

నెల్లూరు(క్రైమ్‌): ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నెల్లూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి జనం నీరాజనాలు పలికారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా తమ అభిమాన నేతను చూసేందుకు, సంక్షేమ సారథికి తమ మద్దతును తెలిపేందుకు ప్రజలు అశేషంగా తరలి వచ్చారు. మండుటెండలోనూ సీఎం రాక కోసం వేచిచూశారు. సాయంత్రం 4.35 గంటలకు వీఆర్‌సీలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం ప్రత్యేక వాహనంలో అక్కడి నుంచి గాంధీబొమ్మ వద్దకు బయలుదేరారు. దారి వెంబడి ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు ఆయన ప్రసంగాన్ని విన్నారు. ఆయన ప్రసంగానికి జయజయధ్వానాలు పలికారు. జై జగన్‌.. జయహో జగన్‌ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. మా నమ్మకం నువ్వే జగన్‌ అంటూ పెద్ద పెట్టున నినదించారు. చిన్నారులు మొదలు వృద్ధుల వరకు ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 6.10 గంటలకు సీఎం హెలికాప్టర్‌లో రేణిగుంటకు బయలుదేరి వెళ్లారు.

కృష్ణపట్నం పీఏసీఎస్‌ అధ్యక్షుడి మృతి

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం పీఏసీఎస్‌ అధ్యక్షుడు కందలూరు వెంకటరామిరెడ్డి(85) శనివారం నెల్లూరులో మృతి చెందారు. ఈయన కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈయన స్వగ్రామం మల్లూరు పంచాయతీ రామాపురం గ్రామం.

12న ఉచిత ఉపనయనాలు

ఆత్మకూరు : ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ శంకర్‌ జయంతి రోజు ఆదివారం స్థానిక శివాలయంలో ఉచిత ఉపనయనాలు నిర్వహించనున్నట్లు ఆ సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మేక్ల చెరువు శివకుమారశర్మ, వాకాటి మురళీ తెలిపారు. శివాలయ ప్రాంగణంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు 94404 65814, 92950 05000 నంబర్లను సంప్రదించాలన్నారు.

గణనాథునికి విశేష పూజలు



విశేషాలంకరణలో స్వామివారు

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వినాయకుని దర్శించుకున్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉదయగిరి నియోజకవర్గానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయగిరిలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఎం రాజారమేష్‌ప్రేమ్‌కుమార్‌ తెలిపారు. శనివారం ఆయన ఉదయగిరిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గంలో 2,336 పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది ఈ నెల 5,6 తేదీల్లో తమ ఓటు హక్కును పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 85 ఏళ్లకుపైబడిన వృద్ధులు, దివ్యాంగులు 173 మంది హోమ్‌ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 71 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు.



గాంధీబొమ్మ సెంటర్‌ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

జయహో జగనన్న

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నెల్లూరుకు విచ్చేసిన సంక్షేమ సారథి, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. హెలిప్యాడ్‌ ఏర్పాటు చేసిన వీఆర్సీ వద్ద, సభ ఏర్పాటు చేసిన గాంధీబొమ్మ సెంటర్‌ వద్ద ప్రజలు ఇసుక వేస్తే రాలనంతగా నిండిపోయారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జగనన్న ప్రసంగాన్ని విన్నారు. జై జగన్‌.. జయహో జగనన్న నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.



అడిగో జగన్‌ మామ..

ఆడపడుచులకు అండగా జగనన్న ప్రభుత్వం



మహిళలతో మాట్లాడుతున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని ప్రతి ఆడపడుచుకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా సాధికారత కల్పించిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్‌ కార్పొరేటర్‌ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్‌ నియోజకవర్గానికి సంబంధించి నగరపాలక సంస్థలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, వారిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఓటున్న ప్రతి మహిళా ఫ్యాన్‌ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలోని 31 లక్షలకు పైగా ఇళ్లపట్టాలు మహిళలకు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు అవ్వాతాతలు, దివ్యాంగులు తదితర పింఛన్‌ లబ్ధిదారులు అవస్థలు పడేలా చేశారని మండిపడ్డారు. పేదలు రాజకీయంగా ఎదగకూడదని, వారికి మంచి జరగకూడదనేదే చంద్రబాబు లక్ష్యమన్నారు. పేదోడికి మంచి చేయాలనేదే జగనన్న అజెండా అని, వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

అభ్యర్థులకు ఓటర్ల జాబితా పంపిణీ



తుది ఓటరు జాబితాను అందజేస్తున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గం 2024 ఏప్రిల్‌ 25వ తేదీ నాటికి సమీకృత ఓటర్ల జాబితాను రిటర్నింగ్‌ అధికారి వికాస్‌మర్మత్‌ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు అందజేశారు. స్థానిక కార్పొరేషన్‌ కార్యాలయంలోని కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌ విభాగంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై ఓటర్ల తుది జాబితాను అందుకున్నారు. ఇతర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్‌ అభ్యర్థులు ఎన్నికల కమిషన్‌ వెబ్‌సైట్‌ నుంచి లేదా తగు రుసుము చలానా ద్వారా చెల్లించి జాబితాను రిటర్నింగ్‌ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని ఆర్‌ఓ తెలిపారు.

పారదర్శకంగా హోమ్‌ ఓటింగ్‌ ప్రక్రియ

• రిటర్నింగ్‌ అధికారి వికాస్‌మర్మత్‌



హోమ్‌ ఓటింగ్‌ను వినియోగించుకున్న వృద్ధుడు

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో హోమ్‌ ఓటింగ్‌ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రిటర్నింగ్‌ అధికారి వికాస్‌మర్మత్‌ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 5 ప్రత్యేక హోమ్‌ ఓటింగ్‌ ఎన్నికల బృందాల ద్వారా ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 153 ఓట్లు ఉండగా శుక్రవారం 94 మంది, శనివారం 54 మంది సీనియర్‌ సిటిజన్స్‌ తమ ఓటు హక్కును హోమ్‌ ఓటింగ్‌ ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు.

హజ్‌ యాత్రికులకు వ్యాక్సినేషన్‌



వ్యాక్సినేషన్‌ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్‌): జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్‌ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పెంచలయ్య శనివారం ప్రారంభించారు. నగరంలోని కోటమిట్ట అర్బన్‌హెల్త్‌ సెంటర్‌ పరిధిలో డాక్టర్‌ నవీన్‌ కృష్ణ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెంజా, మెనింజోకోకల్‌ లాంటి వ్యాక్సిన్‌లు ఉచితంగా యాత్రికులకు వేస్తున్నామని, 151 మంది వ్యాక్సిన్‌ వేయించుకున్నారని తెలిపారు. హజ్‌ యాత్రకు వెళ్లేవారు తమ పేర్లు నమోదు చేసుకుంటే వారందరికీ వ్యాక్సిన్‌ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఖాదర్‌వలి, డీఐఓ సెలీనాకుమారి, డాక్టర్లు గీతాంజలి, ప్రసూన, యజ్మా సుల్తానా, నాగేంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సమష్టి కృషి



వరికుంటపాడు: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని మండలంలోని కనియంపాడుకు చెందిన నాయకులు కార్యకర్తలు శనివారం కలిశారు. ఏఎంసీ మాజీ చైర్మన్‌ షేక్‌ ఆలీఅహ్మద్‌, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ మందలపు తిరుపతినాయుడు ఆధ్వర్యంలో దుత్తలూరు లోని పార్టీ కార్యాలయంలో మేకపాటిని కలిసి ఆత్మీ య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ఉదయగిరి ఎమ్మెల్యేగా రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని భరోసానిచ్చారు. జిల్లా ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ మాగంటి శ్రీనివాసులు, దారపునేని చెన్నారాయుడు, సర్పంచ్‌ కే దిలీప్‌కుమార్‌, సీనియర్‌ నాయకులు ఆర్‌ కోటయ్య, గుర్రం భాస్కర్‌రెడ్డి, కే రమేష్‌, ఆర్‌ బంగారుబాబు, కే హెబెల్‌, దావీద్‌, వెంకటేష్‌, వినోద్‌, ఆదాం, మోసే, రమేష్‌, అజయ్‌, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

• డ్వామా పీడీ వెంకట్రావ్‌

నెల్లూరు(పొగతోట): ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులందరూ పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును ఫెసిలిటేషన్‌ సెంటర్లలో పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫెసిలిటేషన్‌ సెంటర్లలో పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇతర జిల్లాల్లో పని చేస్తున్న జిల్లాకు చెందిన ఉద్యోగుల కోసం దర్గామిట్టలోని జెడ్పీ బాయ్స్‌ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్‌ సెంటర్‌లో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటుహక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. వివరాలకు 0861–2331999 (ఓ), 0861–2331626, 2325025 (ఎఫ్‌), 0861–2331235, 2325025 (ఆర్‌) ఫోన్‌ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

పుస్తకావిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): టిప్పు సుల్తాన్‌ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఆవాజ్‌ కమిటీ జిల్లా కార్యదర్శి రఫీద్‌ అన్నారు. టిప్పు సుల్తాన్‌ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని ప్రజాశక్తి బుక్‌ హౌస్‌లో ఆ జీవిత చరిత్రకు సంబంధించిన ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌ హౌస్‌ మేనేజర్‌ అరుణ, ఆవాజ్‌ కమిటీ నాయకులు రహమతుల్లా, రియాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 893 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 63 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్‌ మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదు, ఆరో సెమిస్టర్‌ పరీక్షలకు 113 మంది విద్యార్థులకు గానూ 107 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన నాలుగో సెమిస్టర్‌ పరీక్షకు 846 మందికి గానూ 786 మంది హాజరయ్యారని తెలియజేశారు.

ఇళ్లలో చోరీ

మనుబోలు : మనుబోలు మండల కేంద్రం అంబేడ్కర్‌ నగర్‌లో శుక్రవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత మెడిబల్లి వినోద్‌, రాజనాల బ్రహ్మయ్య ఇళ్లలో ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లను చోరీ చేశారు. వినోద్‌ ఇంట్లో రూ.24 వేల నగదు, మూడు జతల కమ్మలు, బ్రహ్మయ్య ఇంట్లో ఒక ఉంగరం, రెండు సెల్‌ఫోన్‌లు అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోండి



అల్లూరులో సాయిధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై శ్రీనివాసులురెడ్డి

అల్లూరు: సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అల్లూరు ఎస్సై శ్రీనివాసులరెడ్డి కోరారు. మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో శనివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ప్రశాంత ఎన్నికలకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





మేయర్‌ దంపతులు, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డిలతో మాట్లాడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నెల్లూరు నగరానికి విచ్చేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని నగర మేయర్‌ స్రవంతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీఎం వారికి సూచించారు.

నెల్లూరు సిటీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నెల్లూరుకు వచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్‌ రాష్ట్ర అధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్‌ జగన్‌

• వైఎస్సార్‌సీపీ రూరల్‌ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేసిన సంక్షేమ సారథి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌ నియోజకవర్గంలోని 30వ డివిజన్‌లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ తాను రూరల్‌ ఇన్‌చార్జిగా వచ్చిన ఏడాది కాలంలో రూ.150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డి, రూరల్‌ ఎమ్మెల్యేగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ కూకటి ప్రసాద్‌రావుయాదవ్‌, నాయకులు నారాయణరెడ్డి, తురక సూరిబాబు, కంటే శ్రీనివాసులు, ముత్తంగి రామయ్య, వడ్డే పార్థసారథి, కైలాసం నవీన్‌రెడ్డి, ఒరుపల్లి శ్రీనివాసులురెడ్డి, పెంచలరాజు, కోటయ్య, వైవీ రామిరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌ హరిబాబుయాదవ్‌, మల్లు సుధాకర్‌రెడ్డి, లంక రామశివారెడ్డి, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, అయిరెడ్డి సుబ్బారెడ్డి, పిండి సురేష్‌, ఏసు నాయుడు, నాయబ్‌రసూల్‌ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఆర్‌ఓ వికాస్‌మర్మత్‌

నెల్లూరు(బారకాసు): స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తోన్న చివరి విడత ఎన్నికల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతులను పరిశీలించిన నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి వికాస్‌మర్మత్‌ మాట్లాడుతూ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు శిక్షణ తరగతులను నిర్వహించి పీఓ, ఏపీఓల విధివిధానాల గురించి క్షుణ్ణంగా వివరించామన్నారు. శిక్షణలో ట్రయల్‌ పోలింగ్‌ నిర్వహించి, ఎన్నికల్లో ప్రతి విభాగం చేయాల్సిన అన్ని విధులనూ చేయిస్తూ అవగాహన కల్పించారని వివరించారు. డిస్ట్రిబ్యూషన్‌ కేంద్రాల్లో మెటీరియల్‌ను పరిశీలించుకోవడం, వాటిని పొందాక పోలింగ్‌ కేంద్రాలకు తరలించడం, మార్క్‌ పోల్‌ విధానం, ఈవీఎంల సీలింగ్‌ విధానం, ప్రతికూల పరిస్థితుల్లో ఈవీఎంల రీప్లేస్‌మెంట్‌, వీవీప్యాట్ల ఏర్పాటు, పోలింగ్‌ కేంద్రాల్లో డిస్ప్లే బోర్డులు, హౌస్‌ ఆఫ్‌ పార్లమెంట్‌, ఆంధ్రప్రదేశ్‌ లెజిస్లేటివ్‌ అసెంబ్లీ తదితర అంశాలపై అసెంబ్లీ లెవల్‌ మాస్టర్‌ ట్రైనర్స్‌ అవగాహన కల్పించారని తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులకు నమూనా పరీక్షను నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ శర్మద, ఏఆర్‌ఓ దేవీకుమారి, ఏఈఆర్‌ఓ ప్రసాద్‌రావు, టీపీఆర్‌ఓ ప్రసాద్‌, మేనేజర్‌ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



మద్యం స్టాక్‌ వివరాలను పరిశీలిస్తున్న ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ రేణుక

నెల్లూరు(క్రైమ్‌): ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌ అండ్‌ రెస్టారెంట్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ వి.రేణుక హెచ్చరించారు. శనివారం ఆమె జిల్లా ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ అధికారి కె.నాగమల్లేశ్వరరెడ్డితో కలిసి జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌ అండ్‌ రెస్టారెంట్లతోపాటు తిరుపతి జిల్లా తడ చెక్‌పోస్టు, సూళ్లూరుపేట, గూడూరులోని మద్యం దుకాణాలు, ఓజిలి ఐఎంఎల్‌ డిపోలను తనిఖీ చేశారు. స్టాక్‌ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలు, సరఫరాపై నిరంతర నిఘా ఉంచామన్నారు. నిర్ణీత మోతాదులోనే మద్యం విక్రయాలు జరగాలని, పెద్ద మొత్తంలో విక్రయిస్తే క్రిమినల్‌ చర్యలు తప్పవని ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది, బార్‌ల నిర్వాహకులను హెచ్చరించారు. తనిఖీల్లో ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎ.రేఖ, ఎం.వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న ఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు): కమిషనర్‌ వికాస్‌మర్మత్‌ ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ నిర్వహణ పనుల్లో భాగంగా అన్ని డివిజన్లలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్నామని ఆరోగ్యశాఖాధికారి డాక్టర్‌ వెంకటరమణ తెలిపారు. స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా 45వ డివిజన్‌ రామ్మూర్తినగర్‌ ప్రాంతంలో జరుగుతున్న మురుగు కాలువల్లో పూడికతీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో ప్లాస్టిక్‌ వ్యర్థాలు, కవర్లు వేయడం వల్ల పారుదలకు ఆటంకం ఏర్పడి దుర్వాసన వస్తుందన్నారు. అపరిశుభ్ర వాతావరణం దోమల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుందని, తద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పూడికతీత పూర్తయిన తర్వాత ఆ మురుగు, చెత్తను వాహనాల ద్వారా తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూడికతీత పనులను నిరంతరం పర్యవేక్షించేలా సచివాలయ శానిటేషన్‌ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.